క్లుప్తంగా

అమ్మవారికి పూజలు

బిజినేపల్లి: మండలంలోని వెల్గొండ గ్రామ ప్రజల ఆరాధ్య దైవమైన అమ్మవారికి బుధవారం మధ్యాహ్నం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యాదేవి గుట్టపై అమ్మవారిని అభిషేకాలు చేసి అలంకరించారు. అనంతరం గ్రామస్తులు కీర్తనలు, భజనలతో అమ్మవారిని కొలిచారు. నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

వేతనాలు పెంచాలి

బిజినేపల్లి: వేతనాలు పెంచాలని కోరుతూ బుధవారం ఎంపీడీఓ కథలప్పకు ఫీల్డ్ అసిస్టెంట్లు వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలో ఎంపీడీఓను కలిసి పలు సమస్యలను వివరించారు. అస్కని వేమన, వజీదాబేగం తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సిమెంట్ వితరణ

కల్వకుర్తి రూరల్: మండలంలోని లింగసానిపల్లిలో నిర్మించే హనుమాన్ దేవాలయానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ 100 బస్తాల సిమెంటును బుధవారం సమకూర్చారు. ఆలయ కమిటీ సభ్యుల విజ్ఞప్తి మేరకు సిమెంట్‌ను అందించారు. కార్యక్రమంలో రాములు, కిరణ్, శేఖర్ రెడ్డి, పరశురాములు, భీమయ్య, సత్యం, శ్రీను, వెంకట్ రెడ్డి, నాగరాజు తదితరులు ఉన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

లింగాల: మండలంలోని అంబట్‌పల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులకు ప్రభుత్వం నుంచి సరఫరా అయిన నోట్ పుస్తకాలను బుధవారం పంపిణీ చేశారు. హెచ్ఎం ఇందిరా, అతినారపు తిర్పతయ్య, మహేష్, లింగస్వామి, శివ, ఉపాధ్యాయులు ఉన్నారు.

దుండగులపై పీడీయాక్ట్ నమోదు చేయాలి



బిజినేపల్లి: లింగసానిపల్లిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులపై పీడీయాక్ట్ నమోదు చేయాలని జిల్లా బహుజన నాయకుడు మంగ విజయ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. వ్యాపార దుకాణాలు, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు స్వచ్ఛందంగా మూసివేశారు. గూట విజయ్, కరిగళ్ల దశరథం అజీజ్, పృథ్వీరాజ్, సీ.కల్యాణ్, రాంచందర్, బోరు కృష్ణయ్య, లక్ష్మయ్య, జీ.వెంకటయ్య, విల్సన్, చెన్నయ్య, మంగి రాజు, పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు అమర్చాలి

నాగర్‌కర్నూల్ రూరల్: లింగసానిపల్లిలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దగ్గర సీసీ కెమెరాలను అమర్చాలని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. డిమాండ్ చేశారు. జేఏసీ వంగూరు జయశంకర్ బీసీ పొలిటికల్ జిల్లా అధ్యక్షుడు అరవింద్, శేఖర్, నాగరాజు, బాలరాజు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

మన్ననూర్: బిజినేపల్లి మండలం లింగసానిపల్లిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని అంబేడ్కర్ సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు జక్క బాలకిష్టయ్య డిమాండ్ చేశారు. అమ్రాబాద్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

శ్మశాన వాటిక నిర్మాణానికి భూమి పూజ

పెద్దకొత్తపల్లి: మండలంలోని బాచారంలో బుధవారం శ్మశాన వాటిక నిర్మాణానికి ఇన్‌చార్జ్ ఏపీఓ వెంకటేష్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా శ్మశాన వాటికలు, డంపింగ్ యార్డులను నిర్మిస్తునట్లు పేర్కొన్నారు. ఏఈ నాగేశ్వర్‌రెడ్డి, టీఏ మణిరామ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీలో సమస్యలు పరిష్కరించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్ డిమాండ్ చేశాడు. బుధవారం 7వ వార్డులోని పలు కాలనీలను ఆయన సందర్శించారు. కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందన్నారు. అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

జర్నలిస్టులు వినూత్న నిరసన

కొల్లాపూర్: ఇళ్ల స్థలాలు కేటాయించాలని జర్నలిస్టులు చేపట్టిన నిరాహార దీక్ష 22వ రోజు బుధవారం కొనసాగింది. తెలంగాణ తల్లి, చాకలి ఐలమ్మ విగ్రహాలకు వినతిపత్రాలు ఇచ్చి వినూత్నంగా నిరసన తెలిపారు. పాలకులకు జ్ఞానోదయం కలిగేలా చూడాలని వేడుకున్నారు. మూడు వారాలుగా దీక్షలు చేస్తున్నా మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ కృష్ణ, జిల్లా అధ్యక్షుడు రాంచందర్, జలకం మద్దిలేటి, కురుమయ్య, సీపీ నాయుడు, రమణ, కేశవులు, స్వాములు ఉన్నారు.

సబ్‌స్టేషన్ల చుట్టూ ప్రదక్షిణలు

- రెండేళ్లుగా ఎదురుచూపులు
- ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వడంలో అధికారుల నిర్లక్ష్యం



పెద్దకొత్తపల్లి సబ్‌స్టేషన్‌లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, తీగలు

పెద్దకొత్తపల్లి: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులకు రెండేళ్ల కిందట ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరయ్యాయి. మొత్తం 300 మంది రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డీడీ చెల్లించారు. మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్లను కూడా అధికారులు రైతులకు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. రెండేళ్ల నుంచి సబ్‌స్టేషన్ చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేస్తున్నా కనికరించడం లేదు. ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఇటీవల విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పెండింగ్‌లో ఉన్న రైతుల ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేయాలని అధికారులను ఆదేశించడంతో మండలానికి 80 ట్రాన్స్‌ఫార్మర్లు అధికారులు సరఫరా చేశారు. పెద్దకొత్తపల్లి సబ్‌స్టేషన్‌లో 63 ట్రాన్స్‌ఫార్మర్లు పెద్దకారుపాముల, చంద్రకల్ సబ్‌స్టేషన్లలో 17 ట్రాన్స్‌ఫార్మర్లును దించారు. రైతులకు మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్లను నేరుగా అందించకుండా మంత్రి జూపల్లితో పంపిణీ చేయించేందుకు సన్నహాలు చేస్తున్నారు. మండలంలో దేవునితిర్మాలాపూర్, పెద్దకొత్తపల్లి, పెద్దకారుపాముల, సాతాపూర్, కల్వకోలు గ్రామాలల్లో రెండు సంవత్సరాల కిందట డీడీలు చెల్లించిన రైతులకు కాంట్రాక్టర్లు ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వలేదు. కొంతమంది రైతులకు విద్యుత్ స్తంభాలను ట్రాన్స్‌ఫార్మర్ల కోసం దిమ్మెలను నిర్మించుకోవాలని అధికారులు ఆదేశించారు. అవి నిర్మించుకున్న రైతులకు విద్యుత్ వైర్లు, ఏబీ స్విచ్‌లు సరఫరా చేయకపోవడంతో విద్యుత్ సబ్‌స్టేషన్లలో ఉన్నా ఏఈ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు రైతుల సమస్యలను పరిష్కారించడంలో విఫలమయ్యారు. సబ్‌స్టేషన్‌కు మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్లను రైతులకు పంపిణీ చేస్తే ప్రస్తుతం వానాకాలం బావులు, బోర్ల కింద వరి నాట్లు వేసుకునేందుకు ఉపయోగపడుతాయని రైతులు పేర్కొంటున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



రెండేళ్ల కిందట ట్రాన్స్‌ఫార్మర్ కోసం నాలుగు డీడీలు చెల్లించాను. ఇటీవల విద్యుత్ అధికారులు స్తంభాలు ఏర్పాటు చేశారు. దిమ్మె నిర్మించారు, ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వానాకాలంలో సరఫరా చేస్తే పంటలు ఎండకుండా ఉండేందుకు అవకాశం ఉంటుంది. పాలకులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

– బాలయ్య, రైతు, దేవునితిర్మాలాపూర్

సబ్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా



సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయని తెలుసుకొని ప్రతి రోజు సబ్‌స్టేషన్‌కు వస్తున్నా. అధికారులు ఏ విషయం చెప్పడం లేదు. త్వరగా ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వాలి. అధికారలు అందుబాటులో ఉండటం లేదు. రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్లను రైతులకు పంపిణీ చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

– బాలస్వామి, రైతు, దేవునితిర్మాలాపూర్

త్వరలో పంపిణీ చేస్తాం



మండలానికి 80 ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరయ్యాయి. విద్యుత్ లైన్లు, దిమ్మెలు, స్తంభాలను పూర్తయ్యిన తర్వాత సరఫరా చేస్తాం. రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తాం. డీడీలు చెల్లించిన వారందరికి ఇస్తాం. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– శివ, ఏఈ, పెద్దకొత్తపల్లి

రోడ్డు పక్కన గుంతల పూడ్చివేత

సాక్షి ఎఫెక్ట్..

బల్మూర్: 'ఉపాధిలో ఉత్తుత్తి పనులు' అనే శీర్షికతో బుధవారం సాక్షిలో వెలువడిన కథనానికి ఈజీఎస్ అధికారులు స్పందించారు. ఈ మేరకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బల్మూర్–అచ్చంపేట ప్రధాన రహదారి పక్కనే కేవలం అడుగు దూరంలో తీసిన గుంతలను కూలీలతో పూడ్చివేయించి చదును చేశారు. దీంతో స్థానిక ప్రజలు, వాహనదారులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.



గుంతలను పూడ్చుతున్న కూలీలు

వ్యక్తి ఆత్మహత్యా యత్నం

ఉప్పునుంతల: మండలంలోని ఉప్పరిపల్లిలో బుధవారం వడ్డె చిన్నయ్య పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని అచ్చంపేట ఆస్పత్రికి తరలించారు. గ్రామానికి చెందిన కుమ్మరి రాములు, తిర్పతయ్యలు పొలానికి వెళ్లకుండా ఇబ్బంది పెట్టడంతోనే తన తండ్రి మనస్తాపంతో ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు బాధితుడి కుమారుడు వడ్డె రాము పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఏఎస్ఐ బ్రహ్మయ్య తెలిపారు.

పశువుల దొంగకు రిమాండ్

చారకొండ: పశువుల దొంగకు బుధవారం కల్వకుర్తి సివిల్ కోర్టు రిమాండ్ విధించింది. ఎస్ఐ శంషోద్దీన్ వివరాల ప్రకారం మండలంలోని అగ్రహారం తండాలో పద్మ, జటావత్ చాగోలికి సంబంధించిన పశువులను ఈ నెల 14న గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టగా అదేగ్రామానికి చెందిన నేనావత్ సూర్య నాయక్ చోరీ చేసినట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. నిందితుడిని కల్వకుర్తి సివిల్ కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శ్రమదానం

కోడేరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వలంటీర్లు శ్రమదానం నిర్వహించారు. కళాశాలలో పిచ్చిమొక్కలు, కలుపు మొక్కలను తొలగించి పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వంగ వేణి నర్సింహ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పస్పుల శ్రీధర్‌బాబు, అధ్యాపకులు పద్మావతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌నేరంపై కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: సైబర్ నేరంపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం కుమ్మెర గ్రామానికి చెందిన శ్రీనివాసులు పీహెచ్‌డీ చేసేందుకు ఇంటర్‌నెట్‌లో యూనివర్సిటీలను వెతుకుతుండగా ఇక్‌ఫో యూనివర్సిటి పేరిట ఓ లింక్ వచ్చింది. ఈ లింక్ క్లిక్ చేయగా రూ.లక్ష చెల్లిస్తే సీటు రిజర్వ్ చేస్తామని రావడంతో నమ్మి విడతల వారిగా రూ.2.30 లక్షలు చెల్లించాడు. తర్వాత యూనివర్సిటీకి సంబంధించి ఎలాంటి సమాచారం అందకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి బాధితుడు 1930కి ఫిర్యాదు చేశాడు. సైబర్‌నేరస్తుడికి సంబంధించి బ్యాంకు ఖాతాలో రూ. 58 వేలు ఫ్రీజ్ కావడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

పెంట్లవెల్లి: హామీల అమలులో కాంగ్రెస్ విఫలం అయ్యిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతుల వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 850 మంది రైతులకు రైతు భరోసా డబ్బులు జమ కాలేదని, పెంట్లవెల్లి మండలంలోని సొసైటీలో 499 రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. రాజీవ్ యువవికాస్ పథకం అమలు చేయకుండా నిరుద్యోగులను ఇబ్బందికి గురి చేయడం సరికాదన్నారు. సింగిల్ విండో చైర్మన్ విజయరామారావు, మాజీ సర్పంచ్ రాజేష్, సురేందర్‌గౌడ్, బ్రహ్మయ్య, సుమంత్, రఫియొద్దీన్, రామచందర్ పాల్గొన్నారు.

4.1 కిలోలో శిశువు జననం

నాగర్‌కర్నూల్ క్రైం: జనరల్ ఆస్పత్రిలో సాధారణ ప్రసవంలో 4.1 కిలోల శిశువుకు బుధవారం ఓ మహిళ జన్మనిచ్చిందని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. ఉషారాణి తెలిపారు. ఖమ్మం జిల్లాకు చెందిన ప్రియాంకకు పురిటి నొప్పులు రావడంతో జనరల్ ఆస్పత్రిలో చేరారు. స్త్రీ వైద్య నిపుణులు, నర్సింగ్ సిబ్బంది పర్యవేక్షణలో సాధారణ ప్రసవం అయ్యేలా చర్యలు తీసుకున్నారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో స్త్రీ వైద్య నిపుణులు ప్రొఫెసర్లు డా. నీలిమ,డా. సుప్రియ పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై అధికారులు ఆరా

చారకొండ: మండల కేంద్రంలో యూనియన్ బ్యాంకులో సేవలు అందించడంలో బ్యాంక్ మేనేజర్ నిర్లక్ష్యం వహిస్తుడడంతో బ్యాంకు ఖాతాదారులు గత రెండు రోజులు ఆందోళన చేసిన విషయం విధితమే. ఈ మేరకు యూనియన్ బ్యాంకు చీఫ్ మేనేజర్లు టి. రమేష్ బాబు, రాజేష్ బాబు బుధవారం బ్యాంకు సందర్శించి ఖాతాదారుల ఆందోళన విషయంపై ఆరా తీశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందించాలని బ్యాంక్ మేనేజర్‌క సూచించారు. ఖాతాదారులతో సత్సంబంధాలు కొనసాగాలని కోరారు. వారి వెంట అచ్చంపేట యూనియన్ బ్యాంకు మేనేజర్ నర్సింహ తదితరులు ఉన్నారు.

ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలి

కోడేరు: మండలంలో ప్రతి ఒక్కరు ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని టెక్నికల్ అసిస్టెంట్ మల్లికార్జున్ అన్నారు. బుధవారం మండలంలోని బాడిగదిన్నె, మైలారం, కొండ్రావుపల్లి గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న ఇంకుడు గుంతల పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వెంకటేష్, తిరుపతయ్య, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభను అడ్డుకుంటాం

కోడేరు: అర్హులందరికీ ఇళ్లు ఇవ్వకుంటే ఈ నెల 18న కొల్లాపూర్‌లో నిర్వహించే సీఎం రేవంత్‌రెడ్డి సభను అడ్డుకుంటామని సీపీఎం మండల కార్యదర్శి రవి హెచ్చరించారు. అనంతరం వివిధ డిమాండ్లలో కూడిన వినతి పత్రాన్ని అంబేడ్కర్ విగ్రహానికి అందజేశారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు శివశంకర్, రవి, బుచ్చన్న, మాలిక్ తదితరులు పాల్గొన్నారు

తహసీల్దార్‌ను కలిసిన నిర్వాసితులు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో బుధవారం తహసీల్దార్ విజయసింహను 40 ఏళ్ల కిందట శ్రీశైలం ప్రాజెక్ట్ నిర్మాణంలో భాగంగా ఇల్లు, భూములు కోల్పోయిన నిర్వాసితులు కలిశారు. ఈ సందర్భంగా 98 జీఓ నిర్వాసితులు మంచాలకట్ట గ్రామస్తులు పలు సమస్యలను తహసీల్దార్‌కు వివరించారు. అప్పట్లో దాదాపు 67 గ్రామాల ప్రజలు నష్టపోయారని కొందరికే మాత్రమే ఉద్యోగాలు, నష్టపరిహారం ఇచ్చారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు నిర్వాసితులందరికి ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కురుమూర్తి, స్వాములు, తిరుపతయ్య, శివ పాల్గొన్నారు.

ఉద్యోగం పేరుతో పైసా వసూల్



బిజినేపల్లి: ఐసీడీఎస్‌లో అంగన్‌వాడీ ఉద్యోగం ఇప్పిస్తానని మాయ మాటలు చెప్పి రూ.లక్షలు వసూళ్లు చేసి, నాలుగు సంవత్సరాలుగా డబ్బులు తిరిగి ఇవ్వకుండా తనను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని మంగనూర్ గ్రామానికి చెందిన జోగు భీమయ్య ఆన్‌లైన్ పత్రిక విలేకరిపై బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం ఐసీడీఎస్‌లో ఉద్యోగం పేరుతో నిరక్షరాస్యుడినైన తనకు మాయ మాటలు చెప్పి 2021లో రూ. 3,30,000 లక్షలు వసూలు చేశాడని వాపోయాడు. ఉద్యోగం రాకపోవడంతో డబ్బులు తిరిగి ఇవ్వాలని వేడుకున్నా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. డబ్బులు అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఈ విషయమై ఎస్ఐ శ్రీనివాసులు వివరణ కోరగా ఫిర్యాదు అందిందని క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం

వెల్దండ: వ్యవసాయానికి విద్యుత్ కోతలు లేకుండా రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నట్లు నాగర్‌కర్నూల్ డీఈఈ శ్రీనివాస్ రావు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించి ప్రారంభించారు. ఏడీ రాములు, ఏఈ సత్యనారాయణమూర్తి, శ్రీనివాసులు, తిర్పతయ్య, మల్లికార్జున్, ఇన్‌చార్జ్ ఏఈ వెంకటేష్, లైన్‌మెన్ లక్ష్మణ్, విక్రమ్‌రెడ్డి, మల్లేష్, యాదగిరి ఉన్నారు.

మొక్కలను సంరక్షించుకోవాలి

మన్ననూర్: ఇందిర సౌర గిరిజల వికాసం పథకంలో మాచారం గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాటిన పండ్ల మొక్కలను బుధవారం గిరిజన గురుకులాల కార్యదర్శి డాక్టర్ శరత్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పెద్దిరాజుతో పాటూ లబ్ధిదారులతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. నాటిన పండ్ల మొక్కలను కాపాడుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. సీతారామాంజనేయ స్వామి ఆలయంను దర్శించుకున్నారు. ఐటీడీఏ ఏపీఓ యాదమ్మ, గిరిజన ఉద్యోగులు రాములు, తిరుపతయ్య, రేణయ్య, రైతులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న వ్యాపారి

తెలకపల్లి: మండలంలోని లక్నారం గ్రామానికి చెందిన గోపాల నాగమ్మ ఈ నెల 15న మండల కేంద్రంలోని చర్లగిన్నెల రవి దుకాణం ఎదుట పర్సు పోగొట్టుకుంది. గమనించిన వ్యాపారి పర్సును చూడగా అందులో రూ.25 వేల విలువ చేసే బంగారు కమ్మలు ఉన్నట్లు గుర్తించాడు. బుధవారం వ్యాపారి బాధితురాలికి పర్సును అందజేశాడు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

బల్మూర్: విద్య అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.20 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన బాలికల మరుగుదొడ్లను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను చేరుకుంటారని సూచించారు. నియోజకవర్గంలోని ప్రతి పాఠశాలలో శుద్ధ తాగునీరు అందిస్తామన్నారు. బల్మూర్ పాఠశాలలో వంట గదిని నిర్మించేందుకు త్వరలో రూ.10లక్షల మంజూరు చేస్తానని ప్రకటించారు. జాతీయ స్థాయిలో సైన్స్‌ఫేర్‌లో గతేడాదిలో త్రీ ఇన్ వన్ సైకిల్‌ను రూపొందించి ప్రతిభ చాటిన 10వ తరగతి విద్యార్థి గగన్‌చంద్రన్‌ను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం తనిఖీ చేశారు. మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.తారాసింగ్‌కు సూచించారు. ఆస్పత్రికి అందుతున్న మందుల వివరాలను ఫార్మసీ ఆఫీసర్ శ్రీనువాసులును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీఓ రాఘవులు, పాఠశాల జీహెచ్ఎం నరేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, ఏఈ శ్రీనువాసులు, నర్సింగ్ రావు, రాంప్రసాద్‌గౌడ్ , రమేష్, మశన్న, శివగౌడ్, శైలేష్, సుధాకర్‌గౌడ్, చంద్రమౌళి, సాయి, తదితరులు పాల్గొన్నారు.



బల్మూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

ఆదివాసి చెంచులకు ఇందిరమ్మ ఇళ్లు

మన్ననూర్: ఆదివాసీ చెంచులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. పదర మండల కేంద్రంలోని రైతు వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను డాక్టర్ వంశీకృష్ణ ఆదివాసి చెంచులకు అందజేశారు. ఇళ్లు రాని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీడీఓ వెంకటయ్య, నాయకులు రామలింగయ్య యాదవ్, ఆనంద్, చిన్న చంద్రయ్య, ప్రేమ్‌కుమార్, సత్యనారాయణ, వెంకటయ్య, రాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ బీమా తప్పనిసరి

అచ్చంపేట రూరల్: ప్రతి బ్యాంకు ఖాతాదారుడు తప్పనిసరిగా జనరల్ ఇన్సూరెన్స్(ప్రమాద బీమా) తీసుకోవాలని అచ్చంపేట ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ లక్ష్మీకాంత్ సూచించారు. 2024 డిసెంబర్ 31న పట్టణంలోని వై జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అచ్చంపేటకు చెందిన రాఘవేందర్ రెడ్డి మృతి చెందాడు. ఎస్‌బీఐ బ్యాంకు ద్వారా రూ. 20 లక్షల ప్రమాద బీమా మంజూరైంది. ఈమేరకు బుధవారం అచ్చంపేట ఎస్‌బీఐ బ్యాంకులో మృతుడి తండ్రి వెంకట్‌రెడ్డికి ప్రమాదబీమా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ అమర్‌బాబు, జనరల్ ఏరియా మేనేజర్ సనత్, అకౌంటెంట్ దేవి, శ్రీను, రాంభూపాల్ పాల్గొన్నారు.

హామీలు విస్మరించడం సరికాదు

కోడేరు: మండల కేంద్రంలో మినీ స్టేడియం ఏర్పాటు చేస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు, గతంలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిలు హామీలు ఇచ్చారని కాని ఇప్పటివరకు నెరవేర్చడంలో వారు విఫలం అయ్యారని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రవి ఆరోపించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మినీ స్టేడియం ఏర్పాటు చేయకపోతే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వారికి యువత బుద్ధిచెప్పేందుకు సిద్ధంగా ఉందన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు చంద్రశేఖర్, రాము, బాలకృష్ణ, రాజు, సలేశ్వరం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే 'ఉల్లాస్' లక్ష్యం

లింగాల: నిరక్షరాస్యులైన వమోజనులందరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే 'ఉల్లాస్' లక్ష్య మని జిల్లా, మండల రిసోర్సు పర్సన్లు మణికంఠరావు, బాలుఅజయ్ అన్నారు. నేషనల్ లిటరసీలో మిషన్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఉల్లాస్ బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంగా వీఓఏలు, ఆయా పాఠశాలల హెచ్ఎంలకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఉల్లాస్ యాప్ ద్వారా 10 మందికి ఒక వలంటీర్ చొప్పున నియమించి 15 సంవత్సరాలు పైబడిన నిరక్షరాస్యులు ఏ విధంగా చదవడం, రాయడం, నిజ జీవితంలో అవసరమైన గణిత సమస్యలు, ఇతర జీవన నైపుణ్యాలను డిజిటల్ విధానంలో తెలియపర్చాల్సి ఉంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం కొండయ్య, ఐకేపీ ఏపీఎం శ్రీహరి, కంప్యూటర్ ఆపరేటర్ రవి, వీఓఏలు, హెచ్ఎంలు పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న జిల్లా రిసోర్సు పర్సన్ మణికంఠరావు

నిరక్షరాస్యుల గుర్తింపుపై అవగాహన

తెలకపల్లి: మండలంలో నిరక్షరాస్యులుగా ఉన్న ఆయా గ్రామాల వీఓఏలు గ్రామాల ఉపాధ్యాయులకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఉల్లాస్ కార్యక్రమంపై నిరక్షరాస్యులను గుర్తించి ఒక రోజు శిక్షణలో డీఆర్‌పీ మణికంఠ అవగాహన కల్పించారు. ఉల్లాస్ యాప్‌లో ఎలా నమోదు చేయాలో వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులతో ఏపీఎం చంద్రయ్య, సీసీలు పాల్గొన్నారు.

బ్యాంకు మిత్రపై చర్యలు తీసుకోవాలి

అచ్చంపేట రూరల్: ఎలాంటి సమాచారం లేకుండా ఖాతాల్లో డబ్బులు మాయం చేసిన బ్యాంకు మిత్రపై చర్యలు తీసుకోవాలని బుధవారం అచ్చంపేట ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. ఉప్పునుంతల మండలం ఆవులోనిబావికి చెందిన ఎస్‌బీఐ బీసీ పాయింట్ బ్యాంక్ మిత్ర సింగారం గ్రామానికి చెందిన ఎల్లమ్మ 2021 సంవత్సరంలో మృతి చెందినప్పటికీ ఆమె ఖాతాల్లో వృద్ధాప్య పింఛన్, రైతుభరోసా డబ్బులు పడ్డాయి. మృతురాలి ఫింగర్‌ప్రింట్ బదులు బ్యాంకుమిత్ర ఫింగర్ ప్రింట్‌తో మార్పు చేసి ఆమె ఖాతాల్లోని డబ్బులు డ్రా చేశాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. అతడిని ఎన్నిసార్లు అడిగినా డబ్బులు ఇవ్వలేదని, బ్యాంకు అధికారులకు తమ గోడును వెలిబుచ్చినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని వారు వేడుకుంటున్నారు. బ్యాంకులో బ్యాంకు మేనేజరును కలవడానికి వెళ్లగా మేనేజరు లేకపోవడంతో తిరిగి వెళ్లిపోయారు. తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి



కొల్లాపూర్: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్ఎండీ ఫయాజ్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో 12వ పట్టణ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారదర్శకంగా ఇళ్లు కేటాయించాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.2,500 అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పట్టణ కార్యదర్శి యూసూఫ్, నాయకులు ఖాజామైనోద్దీన్, జంగం శివుడు, ఈ.రమణ, శివశంకర్, ఖాదర్ పాషా, కలమంద శంకర్, ఇటుకల కురుమయ్య, దామోదర్, నారాయణ, అలీ తదితరులు ఉన్నారు.

బహుమతుల ప్రదానం

తాడూరు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన పోటీలలో క్లాస్‌మెట్ సహకారంతో బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. శ్రీనువాస చార్యులు, సభ్యులు రాఘవేందర్, బిల్లకంటి రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

డీఈఓకు వినతి



వెల్దండ: మండలంలోని అజిలాపూర్ పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలని కోరుతూ గ్రామస్తులు బుధవారం డీఈఓ రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. గతంలో పాఠశాలలో 7వ తరగతి వరకు విద్యాభ్యాసం కొనసాగేదని ప్రస్తుతం 8వ తరగతి వరకు అప్‌గ్రేడ్ అయ్యిందని విద్యాబోధనకు సరిపడ ఉపాధ్యాయులు లేరని వివరించారు. పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీషు, సైన్స్, హిందీ సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు నష్ట పోతున్నారన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కేశమోని పద్మ, గ్రామస్తులు సిద్ధగోని రమేష్‌గౌడు, కృష్ణయ్యగౌడు, కృష్ణయ్య, కుమార్, రామస్వామి, యాదయ్య, వెంకటయ్య, జంగయ్య ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కల్వకుర్తి రూరల్: మండలంలోని మార్చాలకు చెందిన దండుగుల విష్ణు(49) 20రోజుల క్రితం గ్రామంలో మర్రి చెట్టు ఎక్కి ఆకులు తెంపుతూ ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. కల్వకుర్తి ఆస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతామని ఎస్సై మాధవరెడ్డి వివరించారు.

దివ్యాంగులను చిన్నచూపు చూడొద్దు



తాడూరు: దివ్యాంగులను చిన్నచూపు చూడొద్దని డిప్యూటీ సిట్ ఎయిడ్ డిఫెన్సు సభ్యుడు శ్రీరాం ఆర్యా కోరారు. బుధవారం హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని సిర్సవాడ ఉన్నత పాఠశాల ఆవరణంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దివ్యాంగులపై వివక్ష చూపొద్దన్నారు. అగౌరవంగా, వివక్ష చూపితే జైలు శిక్ష ఉంటుందన్నారు. పాఠశాల హెచ్ఎం రమేష్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.